క్లుప్తంగా

శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అగ్నిప్రతిష్ఠాపన



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, ఉదయం 10 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం , శేషవాహన సేవ నిర్వహించారు. కాగా సోమవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారి పర్యవేక్షణలో పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన, 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమానికి హాజరుకావాలని ఆలయ అభివృద్ధి కమిటీ కోరింది.

రేపు నున్న గ్రామ పంచాయతీ సమావేశం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన జరుగనుందని పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి సమావేశంలో చర్చించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు



కంకిపాడు: రోడ్డు మార్జిన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపును అధికారులు ఎట్టకేలకు చేపట్టారు. కంకిపాడు, పెనమలూరు, కంకిపాడు మండలాల పరిధిలోని విజయవాడ-మచిలీపట్నం ప్రధాన రహదారి వెంబడి కొబ్బరి బోండాలు, భవన నిర్మాణ వ్యర్థాలను గుట్టలుగా పోశారు. రోజుల తరబడి వ్యర్థాలను తొలగించకుండా ఉండటంతో వర్షాలకు కుళ్లి దుర్గంధం వెలువడుతోంది. వ్యర్థాల గుట్టలపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యపై సీహెచ్‌సీ మాజీ చైర్మన్ కిషోర్‌బాబు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆదివారం తెల్లవారుజాము నుంచి వ్యర్థాల తొలగింపు పనులను చేపట్టారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ పేర్కొన్నారు. తనను తాను సంస్కరించుకుంటూ, తమ అహాన్ని త్యాగం చేయడమే బక్రీద్ సారాంశమన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ నాడు అందరూ భక్తిశ్రద్ధలతో సామూహికంగా నమాజు చేసుకుని, ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ముగిసిన యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష






యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయాన్నే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తరలిరావడంతో ఆయా ప్రాంతాలన్నీ రద్దీగా దర్శనమిచ్చాయి. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్షకు అనుమతించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం దాటికి గన్నవరం పరిసర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గన్నవరం పట్టణంతో పాటు దావాజిగూడెం, కేసరపల్లి, వీఎస్.పురంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కేసరపల్లిలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో ఓ తాడిచెట్టుపై పిడుగు పడటంతో దగ్ధమైంది. పిడుగుపాటు శబ్దానికి పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు



కంకిపాడు: బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కంకిపాడు బైపాస్ వెంబడి ఖాళీ స్థలాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు వీలుగా టెంట్‌లను నిర్మించారు. సోమవారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



సావరగూడెంలో ప్రమాదకరంగా ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు



ఇళ్ల మధ్య ఉన్న వైర్లకు పైప్‌లు తగిలించిన గ్రామస్తులు

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాద ఘటికలు మోగిస్తున్నాయి. సావరగూడెం, తెంపల్లి తదితర గ్రామాల్లో ఇళ్ల పైనే విద్యుత్ తీగలు ఉండటంతో ఆ గ్రామాల్లోని గృహ యజమానులు తీవ్ర అవస్థలకు గురి అవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్లపై ఉన్న ఈ విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతున్నారు. వర్షం వస్తే మరింతగా బెంబేలెత్తిపోతున్నారు. తెంపల్లిలో 11కేవీ వైర్లు, ఇండస్ట్రీయల్ ఫీడర్ వైర్లు అనేక గృహాలపై ఉన్నాయి. తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. అసలే వర్షాకాలం. ఆపై వేలాడుతున్న విద్యుత్ తీగలు. ధాబాలపై ఆనుకుని ఉండగా, పైకి వెళ్లాలంటే భయంతో వణికిపోతున్నారు. సావరగూడెం, తెంపల్లి గ్రామాల్లో ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే గృహాలపై ఉన్న విద్యుత్ తీగల వివరాలను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు.

క్రిస్టియన్‌పేటలో పోరంబోకు స్థలం ఆక్రమణ



పంపుతో సహా స్థలాన్ని రబ్బిష్‌తో మెరక చేసిన దృశ్యం

కంకిపాడు: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతి పంపును, దాని చుట్టూ ఉన్న రోడ్డు పోరంబోకు స్థలాన్ని టీడీపీ కార్యకర్తలు ఆక్రమణకు పాల్పడ్డారు. ఏకంగా పంపు పరిసరాలను రబ్బిష్‌తో మెరక చేసి టీడీపీ బ్యానర్లు పెట్టేశారు. మండలంలోని కోలవెన్ను శివారు క్రిస్టియన్‌పేట పరిధిలో గుడివాడ-పునాదిపాడు రోడ్డుకు ఆనుకుని పంచాయతీ అధికారులు చేతి పంపు ఏర్పాటు చేశారు. దాని చుట్టూ ఉన్న ప్రాంతాన్ని టీడీపీ కార్యకర్తలు కొందరు రబ్బిష్‌తో మెరక చేశారు. రాత్రికి రాత్రి రబ్బిష్ మెరక చేయడంపై గ్రామస్తులు పంచాయతీ అధికారులు, రెవిన్యూ అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని చదును చేసి టీడీపీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. చేతి పంపు ధ్వంసం, రోడ్డు పోరంబోకు స్థలం ఆక్రమణపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాలకు చెందిన వంగూరి శివశంకర్‌రావు నలందా కాలేజీలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను శనివారం ఆటోలో వస్తుండగా గంగూరు చేపల కుండీల వద్ద ఆటో ఆగింది. వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీ కొట్టగా ఆటోలో ఉన్న శివశంకర్‌రావుకు గాయాలు అయ్యాయి. అతడిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సూర్యభగవానుడికి గులాబీలతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో ఆదివారం సూర్యభగవానునికి గులాబీలతో అర్చనలు నిర్వహించారు. పీఠాధిపతి శివచార్యస్వామి సూర్యభగవానునికి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో ఆలయంలో కోలాహలం నెలకొంది.

ప్రసాదంపాడులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు



ప్రసాదంపాడులో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారుల్లో చెత్తను తొలగించడంతో పాటు సైడు డ్రెయిన్లల్లో ఆదివారం పూడిక తీశారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి మురుగునీరు సజావుగా పారుదల అయ్యేందుకు పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ప్రతి రోజూ వేకువజాము నుంచే పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పారిశుద్ధ్య సిబ్బందితో డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, వాటర్ ట్యాంక్ బజారు, రవీంద్ర భారతి పాఠశాల రోడ్డు, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను తొలగించినట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై సమస్యలు ఏమైనా ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు

కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా పని చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాకీ బాబు మాట్లాడారు. ఈ నెల 18న జరగనున్న మండల పరిషత్ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రస్తావించాలన్నారు. ప్రధానంగా గత సమావేశాల్లో చేసిన అభివృద్ధి పనుల తీర్మానాలు, వాటిపై సమీక్ష జరగాలని సూచించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశంలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు మాట్లాడుతూ అజెండాలో అంశాలపై సమర్థంగా చర్చ సాగాలని సూచించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు నందిపాటి బిందుమాధవి, బూరగ బాలాజీ, బి.సురేష్, నాయకులు కలకోట ప్రసాద్‌రెడ్డి, ఏసుపాదం, నత్తా రామ్మోహన్‌రావు, చుండూరు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉండటమే కాకుండా తమ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కృష్ణా జిల్లా ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జయప్రకాష్ నారాయణ తెలిపారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. 1974వ సంవత్సరంలో తమ అసోసియేషన్ ఏర్పాటు చేశామని ఆనాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ అసోసియేషన్ ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులను ఉచితంగా అందజేశామన్నారు. ఈ నెల 22వ తేదీన నగరంలోని ఫార్చ్యూన్ మురళీ హోటల్‌లో తమ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు అసోసియేషన్ జాతీయస్థాయి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్ వీజీకే ప్రసాద్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు. 400 మందికి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

వయోవృద్ధ ట్రస్ట్ సేవలు నిరుపమానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరి జీవితంలోను వృద్ధాప్యం అనేది ఒక భాగమని, వృద్ధులను ఆదరించడం కనీస బాధ్యతగా భావించాలని ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివశంకర్‌రావు సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లేఖ్‌రాజ్జీ సోలంకీ జ్ఞాపకార్థం దాతల సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వృద్ధులకు దాతలతో కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 204 నెలలుగా ప్రతి నెలా నిరుపేద వృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు అవసరమైన సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ.. తాము చేపట్టిన ప్రతి సేవా కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రాబోయే రోజుల్లో సేవలు మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాతలు కీర్తికుమార్ జైన్, అనిల్ కుమార్ జైన్, నరేంద్రకుమార్ జైన్, ట్రస్టీలు తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి భగభగలతో అల్లాడిన ప్రజానీకానికి సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనమిచ్చింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులు నీటమునిగాయి. దీంతో వాహనదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వన్‌టౌన్, బెంజిసర్కిల్, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

